పెళ్లి చేసుకుని
దంపతులైన
ఆ ఇద్దరూ
పరాయివాళ్లలా
ఎందుకు ప్రవర్తించారు ?

# బహుమానం




ఆమెకూడా నావెనుకే బస్సెక్కింది.

అంతదూరంలోనూ ఆమె పొడవైన పైటకొంగు నా ముఖాన్ని తెరచాపలా రాసుకుని పోవడం చూసి ఒకింత గర్వంగా ఫీలయ్యాను.

ప్రయాణీకులతో బస్సు రద్దీగా వుంది. అదృష్టం కొలదీ మా ఇద్దరికీ కూర్చోడానికి సీట్లు దొరికాయి. లేడీస్ వరుసలో రెండవ సీటులో తను కిటికీదగ్గర కూర్చుంది. కండక్టర్ వెనుకసీటులో ఆమెనే గమనిస్తూ కూర్చున్నాను.

కొద్ది నిమిషాల తర్వాత బయలుదేరింది బస్సు.


డ్రైవర్ దృష్టి శ్రద్ధగా స్టీరింగ్‌పై నిలిచింది. టికెట్... టికెట్... అంటూ కండక్టర్ తన పనిలో నిమగ్నమయ్యాడు.

కండక్టర్‌మీదనుండి నా దృష్టి ఆమె మీదకు మళ్లింది.

అది కోనసీమ ఏరియా! ప్రకృతి పరవళ్లు తొక్కుతోంది. కిటికీలోంచి పచ్చదనాన్ని నిలువెల్లా కప్పుకున్న ప్రకృతి కాంతను చూస్తూ పరవశించిపోతుందామె. ఈ పోయగాల కోనసీమలో ఎన్ని అందాలో... ఎన్ని అందాలో... మరెన్ని ప్రకృతి దృశ్యాలో... అయినా ఏం లాభం ఆమె అక్కడ... తను ఇక్కడ... ఒంటరిగా ఇద్దరం.

చిన్న నిట్టూర్పు విడిచి ఆమె వైపునుండి చూపు మరల్చుకుందామని ప్రయత్నించి విఫలమయ్యాను.

అసలు ఆమె కూడా తనలాగే ఆలోచిస్తుందా? కావచ్చు. ఎందుకంటే స్త్రీలు భావుకులు. ప్రకృతి అందాలను పురుషులకంటే



ఎక్కువగా స్త్రీలే ఆహ్వానిస్తారట. అదే నిజమైతే ఆమె తనని సైతం మర్చిపోయుండాలి. అయ్యో! ఇంకా అనుమానమా ఆమె వాలకం చూస్తుంటే ప్రస్తుతం ఆమె మనసు ఈ లోకంలోనే లేనట్టుంది.

అవునా! తనేమిటి ఆమెనే గమనిస్తూ ఆమె గురించే ఆలోచిస్తున్నాడు. ఇందాకన్నుంచి ఒకటే తపన మనసులో, ఆమె ఒకసారి

చూస్తే బావుండునని, ఆమె నావైపు చూడదని తెలుసు.

అయినా మనసులో చిన్న ఆశ తొంగి చూస్తోంది. ఊరు చేరుకునేలోపు ఒకే ఒక్కసారి ఆమె నావైపు చూస్తే చాలు. అంతకంటే ఇంకేం వద్దు.

చూస్తుందా చూడదా అనుకుంటూ చిన్నగా దగ్గాను. చివుక్కున తల తిప్పబోయి మళ్లీ ఏమనుకుందో తల అటు తిప్పుకుని బయట ప్రకృతిని చూస్తూ వుండిపోయింది.

దాంతో నాలోకూడా పట్టుదల పెరిగిపోయింది.

ఆమె తనని గమనించనట్టే ఉన్నప్పుడు తనెందుకు పదేపదే చూడడం? తను ఆమె దృష్టిలో ఉన్నతంగా వుండాలంటే ఆమెని పట్టించుకోనట్టే వుండాలి. ఇక అటువైపు చూడకూడదు, అలా అనుకోగానే మళ్లీ అటువైపు చూడాలనిపించలేదు.

కండక్టర్ వస్తే టిక్కెట్టు తీసుకుని జేబులో వేసుకున్నాను. బస్సు పొలిమేర దాటి వేగంగా ప్రయాణిస్తోంది. ఇప్పుడు నా మనస్సు చాలా ప్రశాంతంగా వుంది. అందుకు కారణం చల్లని ఆ వాతావరణం కావచ్చు. లేదా సన్నజాజి తీగలాంటి ఆమె కావచ్చు. ఏది ఏమైనా తను చాలా అదృష్టవంతుడు. ముఖ్యంగా ఆమె విషయంలో. ఒకటి రెండు సంవత్సరాలలో తన జీవితమే పూర్తిగా మారిపోతుంది.

ఆమె తనై... తను ఆమై... ఇద్దరం ముగ్గురమై... ముగ్గురం....

కీచుమని శబ్దంచేస్తూ బస్సు ఆగడంతో నా ఆలోచనలకు బ్రేకు పడింది. తేరుకుని ఏమైందా అని బయటకు చూశాను.

స్పెషల్ స్క్వాడ్ ఆఫీసర్స్ బస్సాపి అందరి టికెట్స్ చెక్‌చేయసాగారు. నా టిక్కెట్టుకూడా చూసి నా చేతికిచ్చేశారు. వరుసగా అందరి టిక్కెట్లు పరిశీలిస్తూ ఆమెనుకూడా టిక్కెట్టు అడిగారు. తను అందరి చూపుల్నుంచి తప్పించుకుంటూ అమాయకంగా అయోమయంగా నావంక చూస్తోంది. చెకింగ్ ఆఫీసర్ ఆమెను రెట్టించి అడుగుతున్నాడు.

పరిస్థితి నాకేం అర్థంకాలేదు. అసలు ఆమె టికెట్ తీసుకుందో లేదో తెలియలేదు. ఏం చేయాలో తోచక చూస్తుంటే ఆమె నన్ను చూపిస్తూ ఏదో చెబుతోంది.

"నా టిక్కెట్టు ఆయన దగ్గరుంటుంది"

వింటూనే ఉలిక్కిపడ్డాను.

"ఆయనెవరు?" చెకింగ్ ఆఫీసరు ప్రశ్న.

"ఆయన... ఆయన..."

"చెప్పమ్మా ఎవరాయన?"

"ఆయన నా భర్తండి!"

"కాబోయే భర్తా?" అతని గొంతులో వెటకారం ధ్వనించడం నాకు బాధ కలిగించింది.

"కాదండి. సొంత భర్తే!"

అలాగా! అంటూ నావైపు తిరిగి "ఏయ్ మిస్టర్! ఈమె టిక్కెట్టు మీ దగ్గరుందా?" కర్కశంగా అడిగాడు ఆఫీసరు.

"అబ్బే! లేదండి" అనేశాను అప్రయత్నంగా.

"ఈమె మీ భార్యటకదా?"

"అవునండి."

"మరి భర్తగా మీ భార్యకు మీరెందుకు టిక్కెట్టు తీసుకోలేదు?"

"ఆమె తీసుకుంటుందనుకున్నానండి"

"బాగానేవుంది భర్త తీస్తాడని భార్య, భార్యే తీసుకుంటుందని భర్త మొత్తానికి టిక్కెట్టే తీయలేదు. ఫైన్ కట్టండి" ఆవేసరికి తప్పనిసరిగా ఫైన్ చెల్లించి నిశ్శబ్దంగా కూర్చున్నాను.

చెకింగ్ పూర్తయ్యాక మళ్లీ బస్సు బయలుదేరింది.

ఛ! ఛ!! ఎంత అవమానం. బస్సులో అందరి దృష్టి తనమీదే పడింది. ఏమనుకుంటారు. కావాలనే టిక్కెట్టు తీయలేదని అనుకోరూ! ఈ రోజు అందరిలో తన పరువు పోయింది. ఇంకెప్పుడూ ఆమెతో ప్రయాణం చేయకూడదు. తనకి సరైన బుద్ధి చెప్పింది. ఆలోచనలతో నా తల వేడెక్కిపోతోంది.

చిన్న ఊర్లో బస్సాగింది. నా ప్రక్క సీటు ఖాళీ అయితే హంసలా నడిచివచ్చి ఆమె నా ప్రక్కన కూర్చుంది. ఆమెని చూడనట్టే బయటకు చూస్తూ కూర్చున్నాను.

"ఏమండీ నన్ను క్షమించండి. నా టిక్కెట్టుకూడా మీరే తీస్తారనుకున్నాను అలవాటుగా. ఇలా నన్ను పూర్తిగా పరాయిదాన్ని చేస్తారని అనుకోలేదు" అంది మృదువుగా చేయి నొక్కి.

"ఏడ్చినట్టుంది! మన పందెం సంగతి మర్చిపోయావా" అన్నాడు కాస్త కోపంగా.

"ఎంత పందెమైతే మాత్రం సొంత భార్యకు టిక్కెట్టు తీయకూడదా ఏమిటి"


"సరే! ఇక ఆ సంగతి వదిలెయ్! ఇంతకీ పందెంలో ఎవరు గెలిచినట్టు?"

"నేనే!"

"నువ్వా!"

"అవును"

"నువ్వెలా గెలిచినట్టు?"



"ఏంటి? మొత్తానికి నేనే గెలిచినట్టు" అంది ధీమాగా.

"కాదు. నేనే గెలిచాను!" అన్నాను నేనుకూడా.

"ఎలా?"

"మొదటగా నువ్వేగా నాతో మాట్లాడావు."

"అప్పటికే మీరు నన్నోసారి చాలాసార్లు చూశారు నన్ను"

"అంటే నువ్వు నావంక చూడలేదా?"

"చూడలేదు."

"అబద్ధాలాడకు. నువ్వు నన్ను చూడకుండానే నేను నిన్ను తినేసేలా చూశానని ఎలా చెబుతున్నావు?" చివరలో నాకేదో పాయింటు దొరికినట్టనిపించింది.

"మీ మగబుద్ధి తెలుసు గనుక"

"ఇక్కడ మగబుద్ధి, ఆడబుద్ధి అన్నది అనవసరం. పందెం ముఖ్యం"

"అవును నేనూ అదే చెప్తున్నాను. గెల్చింది మాత్రం నేనే"

"ఇక ఆమెతో వాదించడం నా తరం కాదనిపించింది. మా పందెంలో తను ఓడిందో, నెగ్గిందో నాకర్థంకాలేదు. మొత్తానికి మాటలతో పందెం గెల్చింది. అసాధ్యురాలే! అని మనసులో అనుకుని నవ్వాను.

"సరే నువ్వే గెలిచావు బహుమతి ప్రదానం మొదలుపెట్టనా మరి" అంటుంటే ఆమె చెంపలు కెంపులవ్వడం నా దృష్టిని దాటిపోలేదు. అది బస్సు కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే నా చేతిలో ఆమె చిత్తయ్యేదే!

సీతకీ, నాకూ ఈ మధ్యనే పెళ్లయింది. కొత్త దంపతులం కావడంతో సంక్రాంతి పండక్కి బయలుదేరి రమ్మని మా అత్తింటి నుంచి కబురువస్తే వాళ్ల సొంత ఊరైన రాజమండ్రి బయలుదేరాం.

మా ఇద్దరి మొదటి ప్రయాణం కావడంతో జీవితంలో ఎప్పటికీ ఒక తీపి జ్ఞాపకంగా మిగిలిపోవాలని సీత సరదాగా చిన్న పందెం కట్టింది. తనూ నేనూ పూర్తిగా పరాయివాళ్లలాగా ప్రయాణించాలి. బస్సు ఎక్కింది మొదలు మళ్లీ రాజమండ్రిలో దిగేవరకు ఒకరికొకరం సంబంధం లేనట్టుగా కనీసం ఒకరివైపు ఒకరు చూసుకోకుండా ప్రయాణం చేయాలట.

గెలిస్తే వంద ముద్దులు బహుమానం.

పందెంలో ఎవరు ఓడిపోయినా గెలిచిన వారికి బహుమతిగా వంద ముద్దులు ఇచ్చుకోవాలి. ఇదేదో బావుందనిపించి, ఇంత మంచి చేస్తున్న సీత నాకు భార్యగా లభించడం నా అదృష్టమని భావించి 'సరే' అన్నాను.

కానీ ఒకటి అనుకుంటే మరొకటి జరిగింది!

జీవితంలో మధుర స్మృతిగా మిగిలిపోతుందనుకున్న మా మొదటి ప్రయాణం మధ్యలో విలన్స్‌వంటి చెకింగ్ ఆఫీసర్స్ రాకతో అపశ్రుతిగా మిగిలిపోయింది.

సరే! జరిగిపోయిందానికి బాధపడి ఏం ప్రయోజనం. తను నొచ్చుకుని సీతనుకూడా నొప్పించడం అర్థం లేనిది. ఇదే ఒక మధుర స్మృతిగా దాచుకోవాలి.

"ఏమండీ!"

సీత పిలుపుకి అటు తిరిగాను.

"ఏమిటాలోచిస్తున్నారు?"

"ఏమీ లేదు" అన్నానేకానీ నాకొక

విషయం అర్ధం కాలేదు.

నిజానికి పందెంలో తను గెలిచినట్టా? ఆమె గెలిచినట్టా? పందెం సంగతి మర్చిపోయి బస్సులో తను చాలాసార్లు ఆమెని చూడడం నిజమే. కానీ ఆ విషయం ఆమెకూడా గ్రహించింది. అంటే ఆమెకూడా తనవైకంట ఓరగా గమనిస్తూనే వుండాలి.

అయితే ఆమె గెలిచినట్టా? తను గెలిచినట్టా? ఏమో!

అయినా ఎవరు గెలిస్తేనేం. బహుమతి ఇద్దరికీ సమానమేకదా. ఇక ఆ విషయం ఆలోచించుకుందాం. అలా అనుకోగానే మనసు హాయిగా నవ్వేసింది.

"ఏమిటీ మీలో మీరే నవ్వుకుంటున్నారు?"

"ఏంలేదు. ముద్దుల బహుమానం ఇవ్వుడే మొదలుపెట్టనా?" అని ఆలోచిస్తున్నాను" అంటూ మెల్లిగా ఆమెమీదకు వొరిగాను.

"అయ్యో! మహానుభావా మీరే గెలిచారు. నేను ఓడిపోయాను కనుక నేనే మీకు ఇవ్వాలి బహుమానం. ఇంటికెళ్లాక మీ బహుమానం పువ్వుల్లో పెట్టి వెన్నెల్లో సగౌరవంగా సమర్పించుకుంటాను" అంది సీత అల్లరిగా నవ్వేస్తూ.

"నేనుకాదు. నువ్వే గెలిచావు. కనుక నేనే ఇచ్చుకోవాలి బహుమానం" అన్నాను వస్తున్న నవ్వుని బలవంతంగా ఆపుకుంటూ.

"కాదు! మీరే గెలిచారు"

"కాదు నువ్వే!"

"ఉహూ! మీరే!!"

మళ్లీ వాగ్వివాదం మొదలయ్యింది మా మధ్య నిశ్శబ్దంగా. ✱

## మంచం

"అబ్బా శోభనం రోజు రెండో మంచం విరగడం భలే విచిత్రంగా వుందికదండీ"

"రెండో మంచమేమిటి జయా ఇదే మొదటి మంచం..."

"అబ్బా. నేను చెప్పేది నా విషయం లెండి"

— మాడిశెట్టి బ్రదర్స్ (నరసరావుపేట)

